క్లుప్తంగా

పశువుల పాకకు నిప్పు



బూడిదైన పశువుల పాక

చంద్రగిరి: ఏళ్ల తరబడి పశువుల పాక ఏర్పాటు చేసుకుని జీవాలను మేపుకుంటూ జీవిస్తున్న పేదలపై ఓ కబ్జాదారురాలు ఆగ్రహించింది. ఆ భూమి తనదంటూ పేదలపై దౌర్జన్యానికి పాల్పడ డంతో పాటు పాకలకు నిప్పంటించిన ఘటన మండల పరిధిలోని పాతశానంబట్లలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పాతశానంబట్లకు చెందిన పుల్లయ్య, కృష్ణయ్య, దొరబాబు, కృష్ణమూర్తి గత 20 ఏళ్లుగా గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున పశువుల పాక, గొర్రెల దొడ్డి, గడ్డివాములు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సుగాలమ్మ అనే మహిళ గురువారం మధ్యాహ్నం ఆ స్థలం తనదేనంటూ పాడి రైతులపై దౌర్జన్యానికి పాల్పడింది. వెంటనే పశువులు, గొర్రెలను తరలించి ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేసింది. ఈ క్రమంలో బాధితులు మాట్లాడుతూ వంకలో స్థలం ఆక్రమించుకోవడానికి మేముంటున్న ప్రాంతమే మీకు కనిపించిందా? అంటూ ప్రశ్నించారు. దీంతో సుగాలమ్మ బెదిరింపులకు పాల్పడినట్లు బాధితులు తెలిపారు. అనంతరం సాయంత్రం ఎవరూ లేని సమయంలో పశువుల పాకకు, గొర్రెల దొడ్డికి నిప్పు పెట్టి కాల్చి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, ఎస్టీ, గురుకుల వసతిగృహాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ సొంత బిడ్డలు వలే విద్యార్థులను చూసుకోవాలని చెప్పారు. నాణ్యమైన భోజనం అందిండం, విద్యుత్ లైట్లు, దోమల నివారణ తదితర అంశాలపై శ్రద్ధ చూపాలన్నారు. మరోవైపు వసతిగృహాలు దెబ్బతిని ఉంటే ఫిబ్రవరి 5వ తేదీలోపు తమకు ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్, ఏపీ డబ్ల్యూఐటీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత పాల్గొన్నారు.



సంక్షేమ వసతి గృహానికి చెందిన అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బీసీ కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్, బీసీ కార్పొరేషన్ జిల్లా చైర్మన్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. 1979 స్వయం ఉపాధి యూనిట్లకు రూ.47.05 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. బీసీ, బ్రాహ్మణ, ఈబీసీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందడానికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. బీసీ కులానికి 1,174 యూనిట్లు, బ్రాహ్మణులకు 9, ఈబీసీకి 89, కమ్మకు 69, క్షత్రియకు 8, రెడ్డికి 54, వైశ్యలకు 12, కాపులకు 564 యూనిట్లు ఆయ కార్పొరేషన్ల ద్వారా అందిస్తామని స్పష్టం చేశారు. 21 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తులకు అర్హులని చెప్పారు. అయితే కాపు కార్పొరేషన్‌కు మాత్రం 21 నుంచి 50 ఏళ్ల వయస్సు కల్గి ఉండాలన్నారు.

రూ.100 కోట్ల పనులు పెండింగ్

కలెక్టరేట్‌లో గురువారం పల్లెపండుగ కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.100కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని మండిపడ్డారు. ఫిబ్రవరి చివరికల్లా వంద శాతం పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమలలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి రామ్మోహన్, పలువురు ఎంపీడీవోలు, ఏపీఓలు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి చంద్రగిరి సమస్యలు

గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టరేట్‌ను కలిశారు. తమ నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

దిగజారుతున్న తిరుమల ప్రతిష్ట

- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ధ్వజం

తిరుపతి గాంధీ రోడ్: చంద్రబాబు హయాంలో టీటీడీ ప్రతిష్టను దిగజారుస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత గత ప్రభుత్వం టీటీడీని పూర్తిగా భ్రష్టు పట్టించిందని, పాప ప్రక్షాళన చేసి స్వామివారి ఆలయాన్ని పునీతం చేసి ఒక గాడికి తెచ్చి భక్తులకు చాలా మెరుగైన సౌకర్యాలు, ఉన్నతమైన దర్శనం కల్పిస్తామని చిలక పలుకులు పలికారు. అయితే వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సమయంలో క్యూలను సైతం సరిగా నిర్వహించలేని పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వానిది. అవగాహన రాహిత్యంతో ఆరుగురు భక్తులు చనిపోయారు. 40 మందికి పైగా భక్తులకు తీవ్ర గాయాలపాలయ్యారు. కేవలం ఈ ప్రభుత్వం అలసత్వం, బాధ్యతారాహిత్యం వల్లే ఈ దుర్ఘటన జరిగింది. వైఎస్సార్‌సీపీ హయాంలో చైర్మన్‌గా వ్యవహరించిన నేను, వైవీ సుబ్బారెడ్డి లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యిలో ఆవు, పంది కొవ్వు కలిపామని చంద్రబాబు అత్యంత దారుణమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీం కోర్టు సీబీఐ విచారణ వేయమని చెప్పింది. ఆ ఒక్క మాట ద్వారా చంద్రబాబు వ్యక్తిత్వం పాతాళంలోకి పడిపోయింది. పరమ భక్తుడిని అని చెప్పుకునే చంద్రబాబు స్వామి వారిని రాజకీయాలకు వాడుకుంటున్నారు. కేవలం రాజకీయాలకు పావుగా శ్రీవారి పేరును చంద్రబాబు వాడుకోవడం శోచనీయం. చంద్రబాబు పాలనపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. తిరుమలలో ఆరేళ్ల బాలుడు కిందపడి చనిపోయాడు. లడ్డూ కౌంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. టీటీడీ ఉద్యోగులే నాలుగు మాడ వీధుల్లో చెప్పులు ధరించి నడుస్తున్నారు. కొండపైకి బిర్యానీ ప్యాకెట్లు తీసుకొచ్చి ఆలయం ముందు భాగంలో ఉన్న రాంబగీచా బస్ స్టాండ్ వద్ద భక్తులు తిన్నారు. తిరుమలలో మద్యం బాటిల్స్ విక్రయిస్తుంటారని సమాచారం. ఇదీ చంద్రబాబూ.. మీరు చేస్తున్న పాలనలో టీటీడీ నిర్వాకం. తిరుమలను ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు ఓ రహదారిగా మార్చారు. టీటీడీ చాగంటి కోటేశ్వరరావు సరిగా పట్టించుకోలేదని చెప్పిన యూట్యూబ్ చానళ్లపై కేసులు పెట్టారు. ఆ చానల్ అనుమతిని సైతం రద్దు చేయాలనే తలంపు చేపట్టారు. ఇందులో ఇద్దరు చానెళ్ల అధిపతుల హస్తం ఉంది. వైకుంఠ ఏకాదశి నాడు చాగంటి వచ్చారు. ఆయన ప్రవచనాలను వాడుకోవడంలో టీటీడీ విఫలమైందని సదరు యూట్యూబ్ చానల్ వారు చెప్పారు. కొండపై బిర్యానీ తిన్నా, మద్యం విక్రయిస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నా చర్యలు కరువు. ఆరుగురు చనిపోయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జేఈవోను ట్రాన్స్‌ఫర్ చేసి చేతులు దులుపుకున్నారు. వైఎస్ఆర్ అనే సీనియర్ జర్నలిస్టుపై అబద్ధపు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం. ఏ పార్టీకి కొమ్ము కాయకుండా నిష్పక్షపాతంగా మాట్లాడితే వైఎస్ఆర్ పై దాడిచేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

కుంభమేళా యాత్రకు ప్రత్యేక టూర్

తిరుపతి కల్చరల్: ప్రయాగరాజ్ మహా కుంభ మేళా యాత్రకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టూరు బస్సులు నడుపుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఫిబ్రవరి 11న ఉదయం 6 గంటలకు బస్సు బయలు దేరి కడప, కర్నూలు, హైదరాబాద్ ప్రయాణికులను పికప్ చేసుకొని వెళ్లి తిరిగి 18వ తేదీన తిరుపతికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అలాగే నెల్లూరు నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, కటక్, చండీఘర్, గయా, బుద్ధ గయా, కాశీ, మీదుగా ప్రయాగరాజ్‌కు యాత్ర బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల్లూరు నుంచి ఫిబ్రవరి 12వ తేదీ బస్సు యాత్ర ఆరంభమై 19వ తేదీ నెల్లూరుతో యాత్ర పూర్తవుతుందని తెలిపారు. ఈ రెండు యాత్రలకు దర్శనం ఖర్చులు, టిఫిన్, భోజనం ఖర్చులు ప్రయాణికులే భరించాలని తెలిపారు. ఈ యాత్రకు అనువైన వోల్వో, మల్టీ యాక్సిల్, సెమీ స్లీపర్ బస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కుంభమేళాకు వెళ్ల దలిచిన ప్రయాణికులు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ సీఆర్‌వో ఆఫీసు లేదా వారి అధీకృత ఏజెంట్ల ద్వారా యాత్రకు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మహా కుంభమేళా యాత్రకు వెళ్ల దలచిన వారు మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848884299లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్పీడీసీఎల్‌లో ఉద్యోగోన్నతులు

- చీఫ్ ఇంజనీర్ గా శోభవాలంటీనా
- ఎస్ఈ లుగా ఐదుగురు
- ఈఈలుగా ఆరుగురు
- డీఈఈలుగా పదిమందికి ఉద్యోగోన్నతి

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ గురువారం సంస్థ సీఎండి సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉన్న శోభ వాలంటీనా కు చీఫ్ ఇంజనీర్‌గా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా చక్రపాణి, నీలం నరేంద్రనాథ్, రమేష్, శేషాద్రి శేఖర్, మురళీధర్ బాబులకు ఉద్యోగోన్నతి కల్పించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఉన్న వెంకట ప్రసాద్, బాలాజీ, భాను నాయక్, పద్మనాభం పిళ్లై, వివేకానంద స్వామి, శ్రీరాములకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించారు. యమున, రఘు, వరప్రసాద్ రెడ్డి, బాలాజీ, వెంకటసుబ్బయ్య, శ్రీదేవి, భార్గవి, నాగరాజు కుమార్, నరేంద్ర రావు, రాధికాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీచేశారు.

గో సంరక్షణతో సమాజం సుభిక్షతం

తిరుపతి కల్చరల్: గో సంరక్షణతో భూమిని రక్షించి సమాజ సుభిక్షతంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని గోరక్ష మహా పాదయాత్ర నిర్వాహకుడు బాలకృష్ణ గురుస్వామి పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మానవాళికి మేలు చేస్తున్న ఏకైక ప్రాణి గోవు అని, కులమతాలకతీతంగా అన్ని వర్గాలకు గోవులు ఉపయోగపడుతున్నాయన్నారు. గో వధ అధికమవడంతో గోవుల బతుకులు ప్రశ్నార్థంగా మారుతున్నాయన్నారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలనే డిమాండ్‌తో గత సెప్టెంబర్ 25న కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోవుతో మహా పాదయాత్ర చేస్తూ తిరుపతికి చేరుకున్నట్టు గుర్తుచేశారు. సమావేశంలో గో పరిరక్షణ నిర్వాహకులు, ప్రకృతి వ్యవసాయ దారులు ప్రభాకర్, చంద్రమౌళి, నిరంజన్ వర్మస్వామీజీ, గీతాంజలి, ఝాన్సీ లక్ష్మీభాయ్, శ్రీనివాస్, జగన్నాథం పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాదం

– తమ్ముడి చేతిలో అన్న మృతి



మృతి చెందిన కోటయ్య

కోట: అన్నదమ్ముల మధ్య వివాదం తలెత్తి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. తమ్ముడు కర్రతో తలపై కొట్టడంతో అన్న ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన గురువారం కోట మండలం, జరుగుమల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్, స్థానికుల కథనం .. జరుగుమల్లి గమళ్లపాళెంకు చెందిన కుమారి కోటయ్య(46), మస్తానయ్య అన్నదమ్ములు. కల్లుగీత కార్మికులుగా పని చేస్తూ పక్కపక్కనే నివాసాలు ఉంటున్నారు. మస్తానయ్య భార్య గుడ్డలు ఉతికే క్రమంలో మురికినీరు కోటయ్య వాకిలిలోకి వస్తుండగా ఇద్దరి భార్యలు గొడవ పడ్డారు. వివాదం కాస్త అన్నదమ్ముల మధ్య గొడవకు దారితీసింది. మాటమాట పెరగడంతో కోటయ్య తమ్ముడు మస్తానయ్యపై కర్రతో దాడి చేశాడు. దీంతో మస్తానయ్య సమీపంలో ఉన్న మరో కర్రతో కోటయ్య తలపై బలంగా కొట్టడంతో అక్కడే కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు కోటయ్యను కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడి పోస్టుమార్టంలో నిర్లక్ష్యం

చంద్రగిరి: స్థానిక ఏరియా ఆస్పత్రి అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. బుధవారం పనపాకం పంచాయతీ పాతపేట గ్రామంలో కాలువలో పడి మృతి చెందిన మూడేళ్ల చిన్నారి మృతదేహాన్ని సాయంత్రం చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం కోసం గురువారం ఉదయం వెళ్లారు. అయితే మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా పోస్టుమార్టం చేయక పోవడంపై కుటుంబ సభ్యులు మండిపడ్డారు. దీనిపై ప్రశ్నిస్తే పోస్టుమార్టం నిర్వహించే వ్యక్తి పుత్తూరు నుంచి రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే పోస్టుమార్టం నిర్వహిస్తామని చెప్పినట్లు తెలిపారు. పలుకుబడి ఉన్న వారికి మాత్రం అధికారులు ఆగమేఘాలపై పోస్టుమార్టం పూర్తి చేసి అప్పగిస్తున్నారని, తమ లాంటి సామాన్యులను రోజుల తరబడి తిప్పుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం మధ్యాహ్నం 2.30గంటలకు పోస్టుమార్టం పూర్తి చేసి, బాలుడి మృతదేహాన్ని అప్పగించారు.

శాశ్వత ఉద్యోగి లేకపోవడంతోనే సమస్య

ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం సేవలను ఇటీవల ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు, వివిధ కారణాలతో మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతికి వెళ్లాల్సిన అవసరం తప్పింది. అయితే పోస్టుమార్టానికి ఉద్యోగులను నియమించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పోస్టుమార్టం నిర్వహించే వ్యక్తి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో విధులు చూసుకుని, ఇక్కడకు రావాల్సి వస్తోంది.

ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్‌గా ఎస్వీయూ పూర్వ విద్యార్థి



డాక్టర్ ఎస్వీ మోహన్‌ను సన్మానిస్తున్న ఏబీఆర్ఎస్ఎమ్ అధ్యక్షులు, సైంటిస్టులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎస్వీ మోహన్ నాగపూర్‌లోని కేంద్రప్రభుత్వ సంస్థ నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఈఈఆర్ఐ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఎస్వీయూలో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో చీఫ్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు, ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ వైవీ.రామిరెడ్డి గురువారం ఆయనను హైదరాబాద్‌లోని ఐఐసీటీలో కలసి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డీ.శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ సౌజన్య ఉన్నారు.

ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను నరికి, అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికీ ఐదేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ... తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ పోలీసులు 2017 ఫిబ్రవరి 8వ తేదీ ఎస్వీఎన్ పీచమల రేంజ్, నాగపట్ల ఈస్ట్ బీట్, ఎర్రగుట్ట అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా, పోలారు తాలూకా, తాదన్ కుప్పానికి చెందిన కే.మణిపుల్లన్, కుప్పంకు చెందిన సీ.శేతు, పీ.దొరసామి 67 ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో రెండో నిందితుడిగా ఉన్న సేతు మృతి చెందాడు. మిగతా ఇద్దరిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కోటేశ్వర్‌రెడ్డి వాదించారు.

రేపటి నుంచి తిరుపతిలో పుస్తక ప్రదర్శన

తిరుపతి కల్చరల్: టీటీడీ సౌజన్యంతో భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి 9వ తేదీ వరకు ఇస్కాన్ రోడ్డులోని వినాయక నగర్ క్వార్టర్స్ క్రీడా మైదానంలో 17వ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్టు భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పుస్తక ప్రదర్శన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. సుమారు 70 స్టాల్స్‌తో వివిధ రకాలకు చెందిన వేలాది పుస్తకాలు ఈ ప్రదర్శనలో లభిస్తాయని తెలిపారు. సమావేశంలో దక్షిణామూర్తి, రవిశేఖర్, యుగంధర్‌రాజు పాల్గొన్నారు.

'ప్రాణదానం'కు 194 మంది ఎంపిక

తిరుపతి తుడా: స్విమ్స్ – టీటీడీ ప్రాణదాన పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సల కోసం 194 మంది పేద రోగులను ఎంపిక చేశారు. ప్రాధాన కమిటీ గురువారం స్విమ్స్‌లో సమావేశమైంది. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ విభాగాల కింద మొత్తం 194 మంది అర్హత కలిగిన పేద రోగులను ఎంపిక చేశారు.

మిస్ యూ చైతూ బావా

- శుక్రవారం పెళ్లి.. ముందురోజు యువతి మృతదేహం లభ్యం
- డిసెంబర్ 14న వివాహ నిశ్చితార్థం
- జనవరి 20న యువతి అదృశ్యం
- 'ఐ లవ్ యూ చైతూ బావా..' అంటూ చివరి లేఖ



పంబలేరులో మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతయ్య (ఇన్‌సెట్) లేహా నిస్సీ(ఫైల్ ఫొటో)



లేహా నిస్సీ రాసిన చివరి లేఖ

గూడూరు రూరల్: 'చైతు బావా.. నా కోసం ఏదైనా చేస్తాను అన్నావుగా.. నీకు పుట్టే బిడ్డకు నా పేరు పెట్టు.. నాకు మీరు చూడగానే నచ్చారు. మీ లైఫ్‌లోకి వచ్చినందుకు చాలా హ్యాపీ అని మీరు అన్నారు. ఆ మాటకు నేను చాలా హ్యాపీగా ఫీలయ్యా.. కానీ ఇప్పుడు బాధపడుతున్నా. మిమ్మల్ని వదిలి వెళుతున్నా.. నా జ్ఞాపకాలు మీతో విడిచి వెళ్లిపోతున్నా.. సారీ..' అని రాసి ఓ యువతి అదృశ్యమైంది. ఆమెకు శుక్రవారం పెళ్లి జరగాల్సి ఉండగా.. గురువారం శవమై తేలింది. ఈ ఘటన గూడూరులో కలకలం రేపింది. వివరాలు.. గూడూరు ఒకటవ పట్టణ ఎస్ఐ తిరుపతయ్య కథనం.. సూళ్లూరుపేట రాఘవయ్యపేట ప్రాంతంలో నివాసం ఉండే శ్యాముయేల్ జయకుమార్ గూడూరు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆయన భార్య రమాదేవి. వారి కుమార్తె (19)ను తాను పనిచేసే కళాశాలలో డేస్ స్కాలర్‌గా బీటెక్ ఈసీఈ గ్రూపులో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాగా తన ఆరోగ్యం బాగా లేక పోవడంతోసెలవు పెట్టి ఇంటి వద్దనే ఉంటున్న శ్యాముయేల్ తన కుమార్తెకు వివాహం చేయాలని నిశ్చయించారు.

వివాహం ముందు రోజే..

బంధువుల అబ్బాయితో వివాహం చేసేందుకు డిసెంబర్ 14న నిశ్చితార్థం చేశారు. జనవరి 31న వివాహం జరిపించేందుకు సిద్ధపడ్డారు. అయితే ఈనెల 20న కాబోయే పెళ్లి కుమార్తె కళాశాలకు అని ఇంట్లో చెప్పి వచ్చేసింది. మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. ఆమె తండ్రి సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదుచేశారు. అప్పటి నుంచి పలు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. అయితే ఏం జరిగిందో తెలియదు గానీ గూడూరు సమీపంలో చదివే కళాశాలకు పక్కనే ఉన్న పంబలేరులో గురువారం ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు

తిరుపతి మంగళం: ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను గడువు లోపు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ స్పష్టం చేశారు. గురువారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, కార్యక్రమాల వివరాలను నిశితంగా పరిశీలించి పురోగతి లేని కార్యక్రమాలను పూర్తి చేయడానికి తగిన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఎన్సీడీ స్క్రీనింగ్, ఆర్‌బీఎస్‌కే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, ఆర్‌సీహెచ్ లక్ష్యాలను తనిఖీ చేశారు. ప్రతి వ్యక్తికీ ఆరోగ్య వైద్య సేవలు అందించడంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మంగళం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయంతి పాల్గొన్నారు.

నాకెవ్వరూ ఎదురులేదు!

- ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఎంచక్కా పశువుల షెడ్డు నిర్మాణం
- అడ్డుకోని యంత్రాంగం

చంద్రగిరి: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అక్రమంగా నిర్మిస్తున్న పశువుల షెడ్డుకు అధికారులు నిధులు మంజూరు చేయడం విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం పశువుల షెడ్డు నిర్మాణం చేయదలచిన పాడి రైతులకు సబ్సిడీ నగదును అందిస్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఆనుకుని ఉన్న భీమవరం లెక్కదాఖల సర్వే నం.155/1లోని కాలువ పోరంబోకు, సర్వే నం.153లోని ప్రభుత్వ భూమిని అక్రమించుకుని పశువుల షెడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డుకు స్థానిక ప్రభుత్వ అధికారులే ప్రత్యక్షంగా ప్రోత్సహించడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై గ్రామస్తులు సైతం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆక్రమణ విషయమై వీఆర్ఓ భాస్కర్‌ను వివరణ కోరగా... రైతు పక్కన కొంతమేర ప్రభుత్వ భూమి ఉందని, ప్రస్తుతం పనులను నిలిపివేశామన్నారు. సర్వే అనంతరం రైతు భూమిలోనే పశువుల షెడ్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

రైతు సంఘాల అభివృద్ధికి చేయూత



మామిడిపై రైతులకు శిక్షణ ఇస్తున్న జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి

చంద్రగిరి: రైతు సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఏజీపల్లిలో శ్రీలక్ష్మీకృష్ణ ఉద్యాన ఉత్పత్తిదారుల సహకార రైతు సంఘం కలెక్షన్ సెంటర్‌లో రైతు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంఘాల ఏర్పాటు ద్వారా చాలా ఉపయోగాలున్నాయన్నారు. సంఘాల ద్వారా కలెక్షన్ సెంటర్లను, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లను నిర్మించుకోవచ్చుని తెలిపారు. రైతులు మధ్య దళారుల ప్రమేయం లేకుండా మామిడి పంటను, మామిడి ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, కరకంబాడి శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ డిసెంబర్, జనవరి మాసాలలో కురిసిన వర్షాలు, నేలలో నిల్వ ఉన్న తేమ, రాత్రి, పగటి ఉష్ణోగ్రతలలో మార్పు, సరైన మోతాదులలో ఎరువులు అందించక పోవడం, యాజమాన్య పద్ధతులను పాటించక పోవడం వల్ల మామిడి పూత ఆలస్యమవుతోందన్నారు. మండల ఉద్యాన అధికారిణి శైలజ, గ్రామ ఉద్యాన సహాయకూరాలు జ్యోతి, రైతు సంఘం అధ్యక్షుడు మోహన కృష్ణ పాల్గొన్నారు.

మళ్లీ ఇదేంది నాని!



గతేడాది మార్చి 16వ తేదిన తొండవాడ జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(ఫైల్)



అదే సబ్‌స్టేషన్‌ను గురువారం తిరిగి మళ్లీ ప్రారంభిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని

తొండవాడ విద్యుత్తు సబ్ స్టేషన్ మళ్లీ ప్రారంభం!

- గత ఏడాది మార్చిలో ప్రారంభించిన అప్పటి తుడా చైర్మన్
- ఇప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే నాని చేత మళ్లీ ప్రారంభం
- నవ్వుకుంటున్న జనం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి ఎమ్మెల్యే తీరు గందరగోళంగా ఉంది. ఆయన చెప్పేదొకటి.. చేసేది మరొకటిగా మారుతోంది. చంద్రగిరి మండలం, జగనన్న కాలనీలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే నిరుపేదలకు అత్యవసరమైన విద్యుత్ సరఫరాను కల్పించడానికి గత ప్రభుత్వంలో చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా రూ.2.08 కోట్లతో 5 మెగా వాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆగమేఘాలపై ఏర్పాటు చేయించారు. ఆ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల 6,500 ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం కలిగింది. ఈ సబ్ స్టేషన్‌ను అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి హయాంలో నిర్మించినప్పటికీ అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతులు మీదుగా గత ఏడాది మార్చి 16న ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఆ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటులో కానీ, ఆ తర్వాత కానీ ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని చేతులు మీదుగా గురువారం మళ్లీ ప్రారంభించారు. ఈ పరిణామంతో స్థానికుల్లో చర్చ మొదలైంది. గత ప్రభుత్వంలో పూర్తి చేసిన ఎన్నో పనులకు మళ్లీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి.. ఎంత మందిని మభ్య పెడతారన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఉత్పన్నమవుతున్నాయి.

వారి త్యాగం వెలకట్టలేనిది



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, మెడికల్ అసోసియేషన్ నాయకులు

తిరుపతి తుడా: కోవిడ్ మహమ్మారి విజృంభణతో ఎంతో మంది ప్రజల ప్రాణాలను కాపాడి అమరులైన వైద్యులు, నర్సింగ్, వైద్యసిబ్బంది త్యాగం వెలకట్టలేనిదని డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది స్మరించారు. కోవిడ్‌లో అమరులైన వైద్యులు, నర్సింగ్, వైద్యసిబ్బంది జ్ఞాపకార్థం ఈఎస్‌ఐ ఆసుపత్రి, తిరుపతి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి తిరుపతిలో గురువారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: మిత్రుడి నుంచి తీసిచ్చిన రూ.30 లక్షల అప్పును తిరిగి చెల్లించాలని కోరినందుకు హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని దళిత ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడపేరు చిట్టిబాబు, మాదిగ మహాజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.సుధాకర్‌బాబు మాట్లాడారు. తిరుమలలో చిరువ్యాపారం చేసుకుంటున్న దళితుడు బి.బాబు తన మిత్రుడి ద్వారా టీటీడీ గెస్ట్ హౌస్‌లో అసిస్టెంట్ షరాబుగా పని చేస్తున్న రాముకు రూ. 30లక్షలు అప్పు తీసి ఇచ్చారని తెలిపారు. ఆ సొమ్ము చెల్లించాలని అతనిపై రాముతో పాటు గ్రీన్ మెరిడియన్ హోటల్ నిర్వాహకుడు ప్రవీణ్ అతనిపై ఈనెల 24న విక్షణారహితంగా దాడి చేశారని, దీనిపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అంతే కాకుండా దాడి చేసిన వారికి టీడీపీ, జనసేన నేతలు కొమ్ముకాయడం దుర్మార్గమన్నారు. దీంతో సోమవారం గ్రీవెన్స్‌డేలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాల మహానాడు నేత శ్రీనివాసులు, సీనియర్ దళిత నేత గంగులయ్య, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మధు, జగజ్జీవన్ భవన్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.గోపి, ఆదయ్య, రమేష్‌బాబు, లోకనాథం పాల్గొన్నారు.

కాలనీల్లో వర్షపు నీటిని మళ్లించండి

- ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించిన కమిషనర్



50డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎన్ మౌర్య ఆదేశించారు. 50వ వార్డులోని భూపాల్ హౌసింగ్ కాలనీ, తిమ్మినాయుడు పాలెం, అరుంధతివాడ, గరుడాద్రి నగర్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ అనిల్ కుమార్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ, ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో కలసి కమిషనర్ పరిశీలించారు. వర్షాల సమయంలో కొండపైన పడే నీరు తమ వీధుల్లోకి ప్రవహిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, తాగునీరు సకాలంలో పంపిణీ చేయాలని ప్రజలు కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ, కాలనీలోనికి వచ్చే వర్షపు నీటిని మళ్లించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ. వెంకట ప్రసాద్, ఎలక్ట్రికల్ డీఈ శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక ప్రణాళికలు

తిరుపతి తుడా: నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అన్నారు. గురువారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అలాగే, నగరంలో విలీనమైన పంచాయతీల్లో ఎక్కువ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కూడా దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, డీఈలు శానిటరీ సూపర్ వైజర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ తనిఖీ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీజేఎస్‌ఎం నగర పాలక ఉన్నత పాఠశాలను గురువారం తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు నమోదు, మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి రోజూ విద్యార్థులందరూ స్కూలుకు వచ్చేలా చూడాలని, యూడీఐఎస్‌ఈ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. విద్యాబోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలేమిటో తెలుసుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి డీవైఈఓ ఎం.బాలాజి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలానికి 115 యూనిట్లు మంజూరు

తిరుపతి రూరల్: వివిధ ఫైనాన్స్ కార్పొరేషన్ల స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామచంద్ర కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, కమ్మ, వైశ్య, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల నుంచి మొత్తం 115 స్వయం ఉపాధి యూనిట్లు మండలానికి మంజూరయ్యాయని వెల్లడించారు. రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఇందులో 50 శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు.

పాకాలకు 51 యూనిట్లు

పాకాల: బీసీ, ఈబీసీ, బ్రాహ్మణ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, కాపులకు సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందని, మండలానికి 51 యూనిట్లు మంజూరు చేశారని గురువారం ఎంపీడీఓ అరుణ తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అవగాహనతోనే కుష్టు నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి తుడా: కుష్టు వ్యాధి లక్షణాలను అవగాహన చేసుకుని ఆదిలోనే గుర్తిస్తే వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించవచ్చని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ.కుమార్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా యాంటీ లెప్రసీ డేను డెర్మటాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డైరెక్టరు మాట్లాడారు. ఫిబ్రవరి 13వ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, వైద్యులు సురేఖ, సమీరా, టీవీ.రమణ, చంద్రిక, రవిశంకర్ పాల్గొన్నారు.

మహిళా చిరు వ్యాపారులను ప్రోత్సహిద్దాం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్: మహిళా చిరు వ్యాపారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం బ్యాంకు రుణాలను మంజూరు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు కోరారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో కెనరా బ్యాంక్ సౌజన్యంతో మహిళలకు వ్యాపారాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ నాగరాజురావు మాట్లాడారు. వివిధ వ్యాపారాలు, మెషినరీ కొనుగోలుకు బ్యాంకు ఇచ్చే రుణాలు, మార్కెటింగ్ గురించి వివరించారు. అనంతరం డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, జిల్లా జీవనోపాధుల అధికారి ధనుంజయ రెడ్డి మాట్లాడారు. ప్రొఫెసర్ గురునాథ్‌రెడ్డి, వ్యాపారవేత్త కేఎస్ విజయకుమార్, అధికారులు ఆదినారాయణ, దూర్వాసులు నాయుడు, నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

2న ఘంటసాల పాటల పోటీ

తిరుపతి కల్చరల్: ఘంటసాల ది గ్రేట్ సినిమా ఫిబ్రవరి 14న విడుదలవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 2న ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం ప్రతినిధి మల్లారపు నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. 16 ఏళ్లలోపు, 16 ఏళ్ల పైబడిన విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 8341532799, 7207532799ను సంప్రదించాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు



పుదిపట్లలో ముళ్లకంపలను తొలగించి బోర్డులను ఏర్పాటు చేసిన సీఐ

తిరుపతి రూరల్: మండలంలోని చెర్లోపల్లె, జూపార్కు ప్రాంతాల్లో గురువారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో జేసీబీలతో ముళ్ల కంపలను తొలగించారు. ఆ ప్రాంతాల్లో మద్యం సేవించరాదని బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుదిపట్ల సర్పంచ్ బడి సుధాయాదవ్, ఎస్ఐ షేక్షావలి, స్థానికులు పాల్గొన్నారు.

ఆవులను తప్పించబోయి..!

అదుపు తప్పిన పోలీసు వాహనం

తిరుపతి రూరల్: ఆవులను తప్పించబోయి పోలీస్ వాహనం అదుపుతప్పడంతో సీఐ, డ్రైవర్ గాయపడిన ఘటన గురువారం తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు...శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీస్ వాహనంలో సీఐ రవి నాయక్, సిబ్బందితో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వస్తూ ఉప్పరపల్లె వద్ద ప్రమాదానికి గురయ్యారు. హఠాత్తుగా రోడ్డుపైకి ఆవులు రావడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సీఐ, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

తిరుమల: తిరుమలలో మూడురోజులుగా టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కన్నడ సంగీత పితామహుడు పురంధరదాసు ఆరాధన మహోత్సవాలు గురువారం ఆస్థాన మండపంలో ఘనంగా ముగిశాయి. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడారు. మానవాళికి పురంధరదాసు జీవితసారమే ఆదర్శప్రాయమన్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి తుడా: ఏపీ హంస (వైద్య ఆరోగ్య అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అసోసియేషన్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీ హంస తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఏపీ హంస ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తమ అసోసియేషన్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ టాటా బాయ్, ట్రెజరర్ ఇమ్రాన్, ఇతర కార్యవర్గ సభ్యులు గిరి, శ్రీనివాస్, వెంకట సుబ్బమ్మ, రాజేష్, సురేంద్ర, మైనంపాటి మునిరాజా, పద్మజ, శాంత కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ టెండర్లకు ఆదరణ నిల్

తిరుపతి అర్బన్: జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల పరిధిలో ఖాళీగా ఉన్న 77 దుకాణాలకు కూటమి ప్రభుత్వం తొలిసారిగా టెండర్లు ఆహ్వానించింది. గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయ చాంబర్‌లో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం నేతృత్వంలో మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఆహ్వానించారు. కేవలం 43 దుకాణాలకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. సరైన ప్రచారం లేకపోవడంతో ఈ పరిస్థితి కలిగిందనే విమర్శలొచ్చాయి. కార్యక్రమంలో తిరుపతి డీఎం బాలాజీ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు గాంధీ ఆదర్శం



అక్షయక్షేత్రానికి నిత్యావసర సరుకులు వితరణ చేస్తున్న ఎస్పీడబ్ల్యూ పూర్వ విద్యార్థినుల సంఘం



ఎస్వీ మెడికల్ కాలేజీ విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంఘిక నాటిక



గాంధీకి నివాళులు అర్పిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

తిరుపతి సిటీ: మహాత్మా గాంధీ సత్యం, అహింస ఆయుధాలుగా పోరాడారని, ఆయన సిద్ధాంతాలు యువతకు ఆదర్శం కావాలని వీసీ ప్రొఫెసర్ ఉమ పిలుపునిచ్చారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా మహిళా వర్సిటీలోని ఆయన విగ్రహానికి అధికారులతో కలిసి వీసీ, అలాగే, పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థినులు సంఘం ఆధ్వర్యంలో 'అక్షయక్షేత్రం'లో నిత్యావసర వస్తువులను వితరణ చేశారు.

ఎస్వీ మెడికల్ కాలేజీలో..

తిరుపతి తుడా: బాపూజీ వర్ధంతి పురస్కరించుకుని ఎస్వీ వైద్య కళాశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సాంఘిక నాటిక వీక్షకులను ఆలోచింపజేసింది. ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడారు. గాంధీ చిత్రపటానికి అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు నివాళులర్పించారు.

కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయంలో..

తిరుపతి కల్చరల్: కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ట్రస్ట్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు, అలాగే గాంధీ భవన్‌లోనూ అన్నదానం చేశారు. ఎస్‌జీఎస్ వాకర్స్ అసోసియేషన్ నేతలు జి.సుబ్రమణ్యంరెడ్డి, బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమ, రావిళ్ల మునిరత్నం నాయుడు, రమేష్, ట్రస్ట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి గాంధీ రోడ్: గాంధీ విగ్రహానికి బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. బీజేపీ నాయకులు చంద్రబాబు యాదవ్, టి.సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి పలువురు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహానికి పలువులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు తలారి రాజేంద్ర, జిల్లా కోశాధికారి తిరుమల శెట్టి వెంకటేశ్వర్లు, ప్రసాద్ రాజు, నాగేంద్ర, వంశీ, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సీపీఎం నేతలు వేణుగోపాల్, ఆర్.లక్ష్మి, టి.సుబ్రమణ్యం, బుజ్జమ్మ, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు నడ్డినారాయణ, మునిలక్ష్మి, గురునాథం, మునిరామయ్య, ప్రసూన, మనోహర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న డాక్టర్ పీసీ.రాయులు, సామంచి శ్రీనివాస్



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో..

క్లుప్తంగా

విరించి-2025 బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం మార్చి 12, 13న నిర్వహించనున్న విరించి–2025 జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ ఉమ గురువారం ఆవిష్కరించారు. సదస్సులో ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అన్ని విభాగాలు నాన్ టెక్నికల్ ఈవెంట్స్‌ను నిర్వహిస్తాయని తెలిపారు. రిజిస్ట్రార్ రజిని, ఎస్‌ఓఈటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, కన్వీనర్ డి.నర్మిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలెస్ట్రా-25లో ఎస్పీడబ్ల్యూ ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో రెండ్రోజుల సెలెస్ట్రా–25 సదస్సులో ఎస్పీడబ్ల్యూ కాలేజీ విద్యార్థినులు సత్తా చాటారు. బిగ్ బ్లాస్టర్స్, టెక్ టాక్స్, టెక్ చారడెస్ పోటీలలో తమ కళాశాల విద్యార్థినులు 40మంది ప్రతిభ చాటి ప్రశంసా పత్రాలు పొందారని ఆ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. కంప్యూటర్ విభాగం విద్యార్థినులను గురువారం ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కె.ఉమారాణి, అధ్యాపకులు డాక్టర్ జి.బాలకృష్ణప్రియ, డాక్టర్ కె.శ్రీలక్ష్మి, భారతి, సంఘమిత్ర పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తమీమ్ అహ్మద్ మాట్లాడారు. కంప్యూటర్ ఆధారిత సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల ద్వారా చేసే మోసాలను సవివరంగా తెలియజేశారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని అడిగితే స్పందించరాదని, అలాగే వెబ్ లింకులను ఓపెన్ చేయరాదన్నారు. మహిళల భద్రత తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇంటర్నెట్, సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలు ఎలా బాధితులవుతున్నారు? వాటి నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో ఎస్ఐ దీపిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గిరిజమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి రైల్వే కాలనీలోని మాతృశ్రీ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అంకాలజిస్ట్ డాక్టర్ పి.నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 9నుంచి 25 ఏళ్లలోపు వారందరూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చాలా వరకు నయం చేసుకోవచ్చన్నారు. పాఠశాల అధినేత డాక్టర్ కె.సుధాకర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ధర్నా

తిరుపతి సిటీ: ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు మొండి వైఖరి వీడి హాస్టల్ ఎన్‌ఎంఆర్‌లను టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట హాస్టల్ ఎన్‌ఎంఆర్ ఉద్యోగులతో కలసి ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు రాజా, రవి, యూనివర్సిటీ హాస్టల్ ఎన్‌ఎంఆర్‌ల నాయకులు రాజశేఖర్, సుధాకర్, లోకేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆఫీస్ సబార్డినేట్, దఫేదర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా కె.గుణశేఖర్, అధ్యక్షుడిగా కోనేటి బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా పట్నం దయాకర్, కోశాధికారిగా వేణుగోపాల్‌తోపాటు 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వివిధ సమస్యలపై చర్చించారు.

సిటిజన్ సర్వే వేగవంతం చేయండి

తిరుపతి రూరల్: మిస్సింగ్ సిటిజన్ సర్వేను మండలంలో వేగవంతం చేయాలని ఎంపీడీఓ రామచంద్ర ఆదేశించారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎనర్జీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలతో సర్వేపై సమీక్షించారు. మండలంలో 16,150 మందికిగాను ఇప్పటి వరకు కేవలం 6,273 మందిని మాత్రమే సర్వే చేశారని, ఇంకా 9,856 మందిని చేయాల్సి ఉందన్నారు.